

అలిపిరిలోనే దేవుడు కనిపిస్తున్నాడు



రోజురోజుకు పెరుగుతున్న వాహనరద్దీ ● చెక్‌పాయింట్‌లోనే గంటల కొద్దీ క్యూలైన్లలో నిరీక్షణ

తిరుమల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుమలకు చేరుకోకముందే శ్రీవారి భక్తులకు అలిపిరిలోనే దేవుడు కనిపిస్తున్నాడు. దర్శనానికే కాకుండా తనిఖీలకూ ఇంతేసి సమయం వాహనాలల్లో నిరీక్షించాల్సి వస్తోంది. తిరుమలకు ముఖద్వారమైన అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రంలో తిరుమలకు వెళ్లే ప్రతి వాహనాన్ని, భక్తులను, లగేజీని తనిఖీ చేస్తుంటారు. ఇక్కడ 12 లైన్లు ఉన్నాయి. ఇందులో ఒక లైన్‌ను వీఐపీల కోసం, మరో రెండు లైన్లను ద్విచక్ర వాహనాల కోసం కేటాయించారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య చెక్ పాయింట్ నుంచి గరుడ సర్కిల్ వరకు వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి.

ఇవీ కారణాలు..

వాహనాలు భారీగా నిలిచిపోవడానికి వివిధ రకాల కారణాలు కనిపిస్తున్నాయి. కొవిడ్ ముందు వరకు రోజుకు 7,500 నుంచి 8 వేల వరకు వాహనాలు తిరుమలకు వచ్చేవి. కొవిడ్ సమయంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కన్నా ప్రయివేటు వాహనాల్లో ప్రయాణం క్షేమమని భావించారు. అదే ఇప్పటికీ కొనసాగుతోంది. గ్రామాల నుంచి కూడా కొందరు కలిసి ట్యాక్సీ మాట్లాడుకుని రావడానికి అలవాటు పడ్డారు. దీంతో ప్రస్తుతం సాధారణ రోజుల్లో 9 వేలు, రద్దీరోజుల్లో 10 వేల వాహనాలు తిరుమలకు చేరుకుంటున్నాయి. దీంతో పాటు 2022లో ఏర్పాటు చేసి స్కానర్లలో చాలా వరకు సక్రమంగా పనిచేయడం లేదు. ఇందువల్ల ఆలస్యమవుతున్నట్టు అధికారులు గుర్తించారు. తనిఖీల విధుల్లో ఎస్పీఎఫ్ సిబ్బంది 35 నుంచి 40 మంది, విజిలెన్స్ సిబ్బంది 24 మంది ఉంటారు. ఈ సంఖ్య సరిపోవడం లేదు.

విస్తరణపై దృష్టి

అలిపిరి తనిఖీ కేంద్రాన్ని మరింత విస్తరించడం తప్ప మరోదారి లేదని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతమున్న 12 లైన్లను 14 లైన్లుగా మార్చడం ఇందులో ఒకటి. అలాగే అత్యాధునిక స్కానర్లు, సిబ్బంది పెంపు, వారికి ప్రత్యేక శిక్షణ వంటి వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నారు. ఇవి అమలైతే అలిపిరిలో నిరీక్షణ సమయం తగ్గే అవకాశం ఉంది.

వజ్రకవచంలో మలయప్ప

జ్యేష్ఠాభిషేకం తొలిరోజు సోమవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి వజ్రకవచంలో దర్శనమిచ్చారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉత్సవమూర్తులకు వజ్రకవచాన్ని అలంకరించి సహస్రదీపాలంకార సేవలో కొలువుదీర్చారు. సేవ అనంతరం స్వామివారు నాలుగమాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఏడాదిలో ఒక్కసారే ఈ వజ్రకవచంలో దర్శనమివ్వడం గమనార్హం. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు. ఇక, మంగళవారం ముత్యపు కవచం, బుధవారం స్వర్ణకవచంతో స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







గేటు వద్ద దూసుకెళుతూ..

సాక్షి కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న టీడీపీ నాయకులు

మహిళలకు మీరిచ్చే గౌరవం ఇదేనా?

జగన్, భారతి క్షమాపణ చెప్పాలి ● సాక్షి కార్యాలయం వద్ద కూటమి నేతల ఆందోళన.. ఉద్రిక్తత

రేణిగుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'అమరావతి మహిళల గురించి సాక్షి ఛానల్‌లో జరిగిన చర్చను చూస్తే చాలు. మహిళలకు మీరిచ్చే గౌరవం ఏపాటిదో అర్థమవుతుంది' అని జగన్‌ను ఉద్దేశించి కూటమి నేతలు పేర్కొన్నారు. ఆ ఛానల్ చర్చలో వాడిన అసభ్యపదజాలాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం సాయంత్రం రేణిగుంటలోని సాక్షి ప్రధాన కార్యాలయం ఎదుట కూటమి నాయకులు, మహిళలు ఆందోళనకు దిగారు. మాజీ సీఎం జగన్, ఆ ఛానల్ అధినేత భారతిరెడ్డి వెంటనే అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక దశలో ఆగ్రహావేశాలు తట్టుకోలేక సాక్షి కార్యాలయం వైపు రాళ్లు రువ్వారు. మహిళలు లోపలకు చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని నిలువరించారు. ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్, సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం తదితరులు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయవంతంగా పూర్తి చేసుకోవడంతో వైసీపీ నాయకులు కుట్ర ప్రకారం బురదజల్లేందుకు సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగానే సాక్షి ఛానల్‌లో అమరావతి మహిళల మనోభావాలు దెబ్బతినేలా పనికిమాలిన మాటలు మాట్లాడారని ధ్వజమెత్తారు. ఈ ఘటనలో ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేయగా, ఇవేమీ పట్టనట్టు తిరిగి వైసీపీ నాయకుడు సజ్జల మీడియా ముందు తాము తప్పు ఏమీ చేయలేదన్నట్టు సమర్థించుకోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే సాక్షి ఛానల్, పత్రికను మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నాయకులు కోడూరు బాలసుబ్రమణ్యం, కార్పొరేటర్ అనిత, చినబాబు, కృష్ణయాదవ్, మధుబాబు, సుబ్రమణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఆందోళనకారులపై సాక్షి ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ప్రతిభకు పట్టం

- 'షైనింగ్ స్టార్స్' అవార్డు ఉద్దేశమన్న మంత్రి అనగాని
- 40 మంది ఇంటర్, 207 మంది పదో తరగతి విద్యార్థులకు పురస్కారాల ప్రదానం
- ప్రశంసాపత్రం, పతకం, రూ.20 వేల నగదు బహూకరణ



'షైనింగ్ స్టార్' విద్యార్థులతో మంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరులు

తిరుపతి(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభకు పట్టం కట్టేందుకే షైనింగ్ స్టార్స్ అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సోమవారం జరిగిన షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో దేశంలోనే మూడో స్థానం నుంచి గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం 19వ స్థానానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కేజీ నుంచి పీజీ వరకు విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ విద్యారంగ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారన్నారు. తిరుపతి, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలం మాట్లాడుతూ.. పేదరికం రూపుమాపాలన్నా రాష్ట్రం అభివృద్ధి సాధించాలన్నా విద్యతోనే సాధ్యమని, అందుకే ఆ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలోనే ప్రతిభావంతులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ఇస్తున్నారని ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, హస్తకళల కార్పొరేషన్ పసుపులేటి హరిప్రసాద్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. అనంతరం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులతో కలిసి మంత్రి అనగాని సత్యప్రసాద్ షైనింగ్ స్టార్స్ అవార్డులను ప్రదానం చేశారు. జిల్లాలో ఈ 2024-25లో అత్యుత్తమ మార్కులు సాధించిన పదో తరగతిలో 207 మంది, ఇంటర్‌లో 40 మంది విద్యార్థులకు.. ఒక్కొక్కరికి రూ.20 వేల చెక్కు, మెడల్, ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు.



ఇంకా బాగా చదవాలనిపిస్తోంది

నేను ఎర్రావారి పాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివా. 591 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రంలో రెండో ర్యాంకును సాధించాను. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గా పరిగణించడం, ఇలాంటి వేదికపై అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడంతో మరింత మంచిగా చదవాలనిపిస్తోంది. - షేవిత



పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనం

పుత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన నాకు 962 మార్కులు వచ్చాయి. ఇలా మంచి మార్కులు వచ్చిన వారిని ప్రైవేటు కళాశాలల్లోనే ప్రోత్సహించేవారు. ఇప్పుడు షైనింగ్ స్టార్స్ పేరిట ప్రభుత్వ కళాశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.20 వేల చొప్పున ఇవ్వడం నాలాంటి పేదలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. మాలాంటి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు థ్యాంక్స్. బాగా చదువుకుని స్థిరపడ్డాక నేనూ ఇలా ఇతరులకు ప్రోత్సాహం అందిస్తా. - తుపాకుల శ్రీజ

నేడు జిల్లాస్థాయి యోగాంధ్ర పోటీలు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు జిల్లాస్థాయి యోగాంధ్ర పోటీలు జరగనున్నాయి. మండలస్థాయిలో విజేతలకు ఈ పపోటీలు ఉంటాయని యోగాంధ్ర నోడల్ అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికార అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత విభాగాల్లో ఒంటరి ఆసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం పోటీలు ఉంటాయన్నారు. జూనియర్ విభాగం 10-18, యువ విభాగం 19-35 సంవత్సరాలవారికి పోటీలు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 88612 95049లో సంప్రదించాలన్నారు.

డీపీటీవోగా జగదీష్



తిరుపతి(ఆర్టీసీ), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో)గా ఎం.జగదీష్ పూర్తిస్థాయిలో నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం ఆయన చిత్తూరు డీపీటీవోగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడున్న వెంకటరావును విజయవాడ డీపీటీవోగా బదిలీ చేశారు. అన్నమయ్యజిల్లా డీపీటీవోగా ఉన్న రాముకు చిత్తూరుజిల్లా ప్రజారవాణాధికారిగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కాగా జగదీష్ ఈ వారంలో బాధ్యతలు తీసుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

డీసీవోగా నాగవర్ధన

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సహకార శాఖ అధికారిణిగా తిరుపతి డీసీవో ఎస్. లక్ష్మి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్వీ నాగవర్ధనను తిరుపతి జిల్లాకు బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యప్రసాద్, కలెక్టర్, ఎస్పీ తదితరులు

విజన్‌తో ముందడుగు

- ఎమ్మెల్యేలు, అధికారుల భాగస్వామ్యంతో కార్యాచరణ
- ఇన్‌ఛార్జి మంత్రి అనగాని వెల్లడి
- జిల్లా, నియోజకవర్గాల విజన్ డాక్యుమెంట్ యూనిట్లు ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో విజన్-2047తో ముందడుగు వేస్తున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. నియోజకవర్గాల అభివృద్ధిలో ఎమ్మెల్యేలు, అధికారులను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. అమరావతి నుంచి జిల్లాలు, నియోజకవర్గాల విజన్ కార్యాచరణ ప్రణాళిక యూనిట్లను వర్చువల్ విధానంలో సీఎం ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి మంత్రి అనగాని, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతిజిల్లాలో జిల్లా,నియోజకవర్గ, మండల, సచివాలయ స్థాయి విజన్ డాక్యుమెంట్లు రూపొందించామని వివరించారు. ఈ ఐదేళ్లలో సాధించే అభివృద్ధితో పాటు 2047 నాటికి సాధించాల్సిన దానినీ వీటిలో పొందుపరిచినట్లు తెలిపారు. విజన్ ప్లాన్ భవిష్యత్తులో గొప్పఫలితాలను ఇస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఐదుగురు సభ్యుల బృందాన్ని నియమించామన్నారు.జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తుడా వీసీగా జేసీకి అదనపు బాధ్యతలు

తిరుపతి, జూన్‌6(ఆంధ్రజ్యోతి): తుడా వైస్ ఛైర్మన్‌గా జేసీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ప్రస్తుతం తుడా అదనపు బాధ్యతలు చూస్తున్న మౌర్య, ఇక కార్పొరేషన్ కమిషనర్‌గానే కొనసాగుతారు. జేసీగా ఉన్న శుభం భన్సల్ తుడా వీసీగా అదనపు బాధ్యతలు చూస్తారు. పట్టణాభివృద్ధి సంస్థలకు ల్యాండ్ బ్యాంక్‌లు ఏర్పాటుచేసే ఆలోచనలో జేసీలకు అదనపు బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తోంది.

యోగాంధ్ర ర్యాలీ



చిన్నగొట్టిగల్లులో మానవహారం ఏర్పాటు చేసిన ఉద్యోగులు, ప్రజలు

భాకరాపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లు పురవీధుల్లో సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ యోగా వల్ల ఏకాగ్రత పెరుగుతుందని, మానసిక ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. మనసు, శరీరం, ఆత్మను ఏకం చేస్తుందన్నారు. అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

చంద్రగిరిలో మానవహారం



మానవహారం నిర్వహిస్తున్న అధికారులు

చంద్రగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటలకు చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి టవర్ క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. యోగ విశిష్టత, ఉపయోగాలపై ప్రజలను చైతన్యపరుస్తూ నినాదాలు చేశారు. తహసీల్దార్ శివరామ సుబ్బయ్య, ఎంపీడీవో శేఖర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకటరత్నం, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు పాల్గొన్నారు.

బీజేపీ రూరల్ మండలాధ్యక్షుడిగా ఈశ్వర్



ఈశ్వర్‌ను అభినందిస్తున్న సామంచి శ్రీనివాస్, గాలి పుష్పలత

తిరుపతి రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ తిరుపతి రూరల్ మండలాధ్యక్షుడిగా ఓటేరుకు చెందిన దేవాంగుల ఈశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఎన్నిక జరిగింది. గతంలో ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సామంచి శ్రీనివాస్, సీనియర్ నాయకురాలు గాలి పుష్పలతకు కృతజ్ఞతలు తెలిపారు. యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవన్‌రాయల్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, శ్రీధర్ ఆయన్ను అభినందించారు.

యోగాతో మానసిక వికాసం



ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు, పోలీసులు

పాకాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసులు సోమవారం యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, ఆర్‌సీసీల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి యోగాపై అవగాహన కల్పించారు. యోగాతో ఆరోగ్యం, శారీరక దృఢత్వం, మానసిక వికాసం పెంపొందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ సంజీవరాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో మాసిలామణి, ఎన్‌సీసీ అధికారి ఈశ్వరబాబు, అధ్యాపకులు మోహన్ బెహరా, ఆదిశేఖర రెడ్డి, చిట్టికళావతి, రమణమ్మ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడి



పంటపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

పాకాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసులు, భరత్ కుమార్, దివ్యసుధలు సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా సోమవారం మండల వ్యవసాయాధికారులతో కలిసి పంటపల్లె, కెవడ్డేపల్లెలో రైతులకు అవగాహన కల్పించారు. అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, భూసార పరీక్షలు, పాముఖ్యత, మేలైన యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. కోళ్ల పెంపకం, పశుపోషణ, పెరటితోటల గురించి వివరించారు. వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం, ప్రభుత్వం అందజేస్తున్న రాయితీల గురించి తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించాలని కోరారు. వ్యవసాయాధికారిణి పుష్పావతి, డీఆర్సీ ఏవో వేణుగోపాలరావ్, ఏఈవో అమీర్ పాల్గొన్నారు.

స్టేటస్ కో ఉన్నా.. మఠం స్థలంలో నిర్మాణాలా?

తిరుపతి, జూన్9(ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివాదాస్పద స్థలంపై పరస్పర ఫిర్యాదులు ఎక్కువవుతున్నాయి. ఇటీవల సదరు స్థలంలో అర్ధరాత్రి వేళ పోలీసులు గేటు తెరిచే ప్రయత్నం చేసిన ఘటన వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంకె నాయుడు కుమారుడు శేఖర్ చౌదరి ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలూ చేయకూడదన్న హైకోర్టు ఉత్తర్వులను రెవెన్యూ, పోలీస్ అధికారులకు అందజేశారు. తిరుపతి రూరల్ అవిలాల గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబరు 145, 147/2లో హథిరాంజీ మఠం, పరకాల మఠంకు చెందిన సదరు భూమి రికార్డులు ఉన్నాయని, వారి నుంచి తాము కొనుగోలు చేశామని, అయితే కొందరు ఫేక్ డాక్యుమెంట్లతో స్థలంలోకి ప్రవేశించారని ఆరోపించారు. సుదీర్ఘకాలంగా న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నామన్నారు. స్టేటస్ కో, ఇంటీరియం ఉత్తర్వులు ఉన్నప్పటికీ రాత్రి వేళల్లో నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. తమ ఫిర్యాదు మేరకే పోలీసులు తనిఖీలకు వెళ్లారని చెప్పారు.

చంద్రగిరి

గీతాంజలి విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



ప్రతిభా అవార్డులు అందుకుంటున్న గీతాంజలి విద్యార్థులు

భాకరాపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): భాకరాపేట గీతాంజలి ఉన్నత పాఠశాల విద్యార్థులు రెడ్డిచంద్రిక, రిత్విక శ్రీసాయి సోమవారం కలెక్టర్, మంత్రి చేతుల మీదుగా ప్రతిభా అవార్డులు, ప్రోత్సాహక నగదు అందుకున్నారు. వారిని కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డి, హెచ్‌ఎం స్వాతి, ఉపాధ్యాయులు అభినందించారు.

యువతి ఆత్మహత్య



మృతిచెందిన హర్షిణి

చంద్రగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువరెడ్డివారిపల్లెలో యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చంద్రగిరికి చెందిన హర్షిణి(25)కి ఎగువరెడ్డివారిపల్లెకు చెందిన నవీన్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. నవీన్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం భర్త తిరుపతికి వెళ్లగా ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో హర్షిణి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.


హెరిటేజ్ వద్ద గ్రామస్తుల నిరసన



హెరిటేజ్ అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

చంద్రగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం కాశిపెంట్లలోని హెరిటేజ్ ఫ్యాక్టరీ కాలుష్యం వల్ల తమ పొలాలు దెబ్బతింటున్నాయంటూ కొందరు రైతులు సోమవారం ఫ్యాక్టరీ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని హెరిటేజ్ అధికారులకు అందజేశారు. హెరిటేజ్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వేస్ట్ వాటర్ వల్ల కాలుష్యం పెరుగుతోందన్నారు. హెరిటేజ్ పాల ట్యాంకర్లు కడిగిన నీటిని రాత్రిపూట పొలాల్లో పోస్తున్నారని ఆరోపించారు. వేలాది పాల ట్యాంకర్లు తిరగడం వల్ల రోడ్లు గుంతలమయమయ్యాయని, మరమ్మతులు చేయాలని కోరారు. పాలను తరలించేందుకు తమకే అవకాశం ఇవ్వాలని వీరు కోరారు. దీనిపై హెరిటేజ్ అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు తమ నిరసనను విరమించారు.

నలుగురు విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు



ఎర్రావారిపాళెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) మండలంలోని నలుగురు విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు వచ్చాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతులమీదుగా సోమవారం అందుకున్నారు. ఇందులో మోడల్ స్కూల్ విద్యార్థులు జ్ఞానేశ్వర్, ఎం.ఉదయ శ్రీ, ఎం.రోషన, కేజీబీవీ పాఠశాల నుంచి హెక్షితశ్రీ, కోటకాడపల్లె జడ్పీహెచ్‌ఎస్ నుంచి సవిత ఉన్నారు. వారిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



మహిళలను కించపరిచిన జర్నలిస్టులను అరెస్ట్ చేయండి

చంద్రగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులను వెంటనే అరెస్ట్ చేయాలని తెలుగు మహిళలు కోరారు. ఈ మేరకు చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి సింగు సుధా మాట్లాడుతూ సాక్షి చానల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అమరావతి మహిళలను కించపరిచే విధంగా జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడారని, వారిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వాటిని సాక్షి ఛానల్ అధినేత భారతి ఖండించి, మహిళలకు క్షమాపణ చెప్పాలన్నారు. రాజధానిపై సాక్షి ఛానల్ విషం కక్కడం బాధాకరమన్నారు. సొంత చెల్లి, తల్లినే బయటకు గెంటేసిన మాజీ సీఎం జగన్‌కు మహిళలపై గౌరవం ఎలా ఉంటుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు కళావతి, దేవి, ముంతాజ్, సావిత్రి, మహేశ్వరి, లక్ష్మీదేవి, సునిత, గుణసుందరి పాల్గొన్నారు.



చంద్రగిరి సీఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ మహిళలు

ఇళ్లు, దుకాణాల తొలగింపుపై నిరసన

చంద్రగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐతేపల్లె, ఎ.రంగంపేట రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్లు, దుకాణాలను తొలగించారు. దీంతో బాధితులు తమకు న్యాయం చేయాలంటూ నిరసన తెలిపారు. ఐతేపల్లె, ఎ.రంగంపేట రోడ్డును 40 అడుగులకు విస్తరిస్తున్నట్లు రెవెన్యూ, పంచాయతీ అధికారులు మార్కింగ్ వేశారని, అయితే తమకు ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను, దుకాణాలను తొలగించారని తెలిపారు. పీజీఆర్‌ఎస్‌లో మాట్లాడి వచ్చేలోగా తొలగించారని పేర్కొన్నారు. దీనిపై వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులను వివరణ కోరగా రోడ్డు విస్తరణతో తమకు సంబంధం లేదన్నారు. అనంతరం బాధితులు చంద్రగిరి పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.



రోడ్డుపై నిరసన తెలుపుతున్న బాధితులు

లో వోల్టేజి సమస్య పరిష్కరించండి

పాకాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివశక్తినగర్‌లో లోవోల్టేజి సమస్య పరిష్కరించాలని ఆ ప్రాంతవాసులు కోరారు. ఈ మేరకు సోమవారం విద్యుత్ కార్యాలయంలో ఏఈఈ ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. గృహ, వాణిజ్య సర్వీసులు 300కు పైగా ఉన్నాయని, తరచూ లో లోల్టేజి కారణంగా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఇళ్లలో ఫ్యాన్లు, లైట్లు కూడా సరిగా వెలగడం లేదన్నారు. రాత్రిపూట విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో దోమల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. స్పందించిన ఏఈఈ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.



ఏఈఈకి వినతిపత్రం అందజేస్తున్న శివశక్తి నగర్ వాసులు

హెచ్‌ఎం, ఎస్‌ఏ పోస్టుల భర్తీలో తిరుపతి కార్పొరేషన్‌కు పెద్దపీట

ప్రైమరీలో 24హెచ్‌ఎం, హైస్కూల్స్‌లో 40కిపైగా ఎస్‌ఏ పోస్టుల భర్తీ



మునికృష్ణనాయుడిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

తిరుపతి(విద్య), జూన్9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మునుపెన్నడూ లేనివిధంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్యాప్రమాణాలు పెంచే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపింది. ఈ క్రమంలో తిరుపతి కార్పొరేషన్ పరిధి(తిరుపతి అర్బన్ మండలం)లోని ఉన్నత పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్, ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ విద్యారంగ ఉన్నతికి పెద్దపీట వేసింది. 24 ఆదర్శ ప్రైమరీ స్కూల్స్ హెచ్‌ఎం పోస్టులతోపాటు ఉన్నత పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులను బోధించే 40కిపైగా స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) పోస్టులను భర్తీ చేసినట్లు తెలిసింది. 2024 డిసెంబరులో 27 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయడంతోపాటు ఇప్పుడు ఆదర్శ ప్రైమరీ పాఠశాలల్లో 24 హెచ్‌ఎం పోస్టులు, వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ఎస్‌ఏ పోస్టులను భర్తీ చేసింది. దీనిపై ఉపాధ్యాయ, విద్యార్థి వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- పట్నాలువీధి ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం బాధ్యతల స్వీకరణ : పట్నాలువీధి ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా భీమినేని మునికృష్ణనాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం తన బాధ్యతను మరింతగా పెంచిందని, పాఠశాలలో విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేస్తామని తెలిపారు. అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ మునికృష్ణనాయుడు విద్యారంగ ఉన్నతికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అభినందించారు. పలువురు టీచర్లు ఆయన్ను సన్మానించారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి(విద్య), జూన్9(ఆంధ్రజ్యోతి): బైరాగిపట్టెడలోని ఎస్టీయూ భవన్‌లో సోమవారం రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీయూ) 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు గాజుల నాగేశ్వరరావు సంఘ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ ఎన్నో ఉద్యమాలు చేపట్టి విజయాలు సాధించిందని తెలిపారు. వేతన సవరణ, పీఆర్సీ ఏర్పాటు, డీఏ సాధన, పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్, అప్రెంటీస్ రద్దు, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు, సీపీఎస్ రద్దు, తెలుగు మీడియం పునరుద్ధరణ, ఉన్నత విద్య ప్రోత్సాహక ఇంక్రిమెంట్లు వంటి ప్రయోజనాల కోసం అలుపెరగని పోరాటాలు చేశామని వివరించారు. సంఘానికి సేవలందించిన రిటైర్డ్ టీచర్లు ఎస్.వెంకట్రామయ్య, పీవీ రాజశేఖర్, భాగ్యలక్ష్మిని సన్మానించారు. నాయకులు జగన్నాథం, భీమినేని మునికృష్ణ నాయుడు, గురుప్రసాద్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కత్తి నరసింహారెడ్డి, టీచర్లు

స్వర్ణాంధ్ర యాక్షన్ ప్లాన్‌పై సీఎం దిశా నిర్దేశం

చంద్రగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 యాక్షన్ ప్లాన్‌పై సీఎం చంద్రబాబు ఏపీ సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో సోమవారం మధ్యాహ్నం చంద్రగిరి నియోజకవర్గ నాయకులకు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే పులివర్తి నాని, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి అధికారులు చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయం నుంచి పాల్గొన్నారు. పీ4ను ప్రవేశ పెట్టడం చాలా సంతోషమని, ఈ విధానం కొన్ని కుటుంబాలకు, నిరుద్యోగ యువతకు చేయూతనిస్తుందని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, చంద్రగిరి తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఆరు మండలాల ఎంపీడీవోలు, పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే పులివర్తి నాని, అధికారులు



తిరుపతి మహతి ఆడిటోరియంలో సోమవారం జరిగిన షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు

హెచ్‌ఎంల బాధ్యతల స్వీకరణ

తిరుతి(విద్య), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో పలు ప్రాథమిక ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పలువురు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బైరాగిపట్టెడలోని డాక్టర్ డిరామానాయుడు పాఠశాల హెచ్‌ఎంగా ఇప్పటివరకు పనిచేసిన ఎస్.భానుమతి పదోన్నతిపై భేరివీధి మున్సిపల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంగా బాధ్యతలు తీసుకున్నారు. ఎంజీఎం మున్సిల్ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ (సోషల్)గా ఉన్న ఎద్దల హేమాద్రిబాబు బదిలీపై రామానాయుడు ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు తీసుకున్నారు. భేరివీధి మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)గా ఉన్న ఎస్.ఖాదర్ బాషా బదిలీపై కొర్లగుంట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు. టీపీపీఎం హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) పి.గోపాల్ బదిలీపై ఎస్టీవీ నగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు తీసుకున్నారు.



హేమాద్రిబాబు, భానుమతి, ఖాదర్‌బాషా

అక్కారంపల్లి మున్సిపల్ ప్రైమరీ స్కూల్ ఎస్జీటీ ఎం.కిరణ్మయి పదోన్నతిపై సప్తగిరినగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు తీసుకున్నారు.

జాహ్నవికి షైనింగ్ స్టార్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న జాహ్నవి

పాకాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని జాహ్నవి షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్నారు. ఇంటర్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో 963 మార్కులు సాధించి, అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం మహతి ఆడిటోరియంలో జిల్లా మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా అవార్డుతో పాటు రూ.20వేల చెక్కు, మెడల్ అందుకున్నారు. ప్రిన్సిపాల్ జేబీశ్వరరెడ్డి, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

పద్మావతీపురంలో యోగాంధ్ర ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ జ్యోతి, గ్రామస్తులు

తిరుపతిరూరల్, జూన్9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పద్మావతీపురం పంచాయతీలో సోమవారం యోగాంధ్ర అవగాహనా ర్యాలీ నిర్వహించారు. యోగా సాధనతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ జ్యోతి, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యోగా దినచర్య కావాలి

తిరుచానూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మానవుడి నిత్య జీవనంలో యోగా ఒక దినచర్య కావాలని చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ అన్నారు. యోగాంధ్రలో భాగంగా సోమవారం ప్రజలకు యోగాపై అవగాహన కల్పిస్తూ తిరుచానూరు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎంత ఒత్తిడినైనా యోగా ద్వారా అధిగమించవచ్చన్నారు. దీర్ఘకాలిక రుగ్మతలను కట్టడి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు సాయినాథ్‌చౌదరి, జగన్నాథరెడ్డి, పోలీసు సిబ్బంది శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న హోంస్టే సీజ్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వ్యభిచారం నిర్వహిస్తున్న వరాహ హోం స్టేపై ఈస్ట్ పోలీసులు సోమవారం దాడులు చేశారు. ఈ హోం స్టేను సీజ్ చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. సుభాష్‌నగర్‌లోని వరాహ హోంస్టేలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు, పోలీసులు దాడులు చేశారు. ఈ హోంస్టేను కాపులూరి రంజిత్ నిర్వహిస్తున్నాడు. నిందితుడు కొండల్‌రావు అలియాస్ బబ్లూ మహిళలను పంపేవాడని ఆరోపణలున్నాయి. కాగా, పోలీసుల దాడి సమయంలో కొండల్‌రావు పరారీ కాగా, కాపులూరి రంజిత్, విటుడు మురళిని అరెస్టు చేశారు. వీరిని విచారించి రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ చెప్పారు. ఈ హోం స్టేను పోలీసులు సీజ్ చేశారు.

'సంకల్ప్'ను సద్వినియోగం చేసుకోండి



తిరుచానూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): 'సంకల్ప్' పథకాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. జిల్లాలో సంకల్ప్ పథకం ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు సోమవారం కలెక్టరేట్‌లో సర్టిఫికెట్లు, ఆఫర్ లెటర్లను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి అందజేశారు. వివిధ కోర్సుల్లో 270 మందికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు రైతులతో కలిసి ఎమ్మెల్యే పులివర్తి నాని మామిడి ధరలపై మంత్రి సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎస్వీ వైద్య కళాశాలకు లాకర్లు, వాటర్ కూలర్ వితరణ



లాకర్లను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రవిప్రభు

తిరుపతి(వైద్యం), జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలకు ఫార్మకాలజీ విభాగం సిబ్బంది రూ.55 వేలు విలువచేసే 12 మెటల్ లాకర్లు, ఒక అధునాతన వాటర్ కూలర్‌ను సోమవారం వితరణ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభును కలిసి అందజేశారు. ఆయన మాట్లాడుతూ పీజీ విద్యార్థులు వారి విలువైన వస్తువులను భద్రపరుచుకునేందుకు లాకర్లు ఉపయోగపడతాయన్నారు. స్వచ్ఛమైన నీటిని తాగేందుకు వాటర్ కూలర్ ఉపయోగకరమన్నారు. అనంతరం ఫార్మకాలజీ విభాగం ప్రొఫెసర్స్ ఆశాలత, భారతి, సిబ్బందిని ఆయన అభినందించారు. వైస్ ప్రిన్సిపాళ్లు సునీత, కిరీటి, వెంకటేశ్వర్లు, డీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి బస్టాండులో ఆర్టీసీ డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామానికి చెందిన వి. మునిశంకర్ నాయుడు చిత్తూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో చిత్తూరు నుంచి తిరుపతికి వచ్చాడు. ప్రయాణికులను దింపి ప్లాట్‌ఫాం నెంబరు 59 వద్ద బస్సు పార్కు చేసి, కండక్టర్ సురేష్‌బాబుతో కలిసి భోజనం చేసి, బస్సుపై పడుకున్నాడు. తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో కండక్టర్ లేచి చూడగా మునిశంకర్ నాయుడు మరణించి ఉన్నాడు. వెంటనే అతని భార్య వి.మీనాక్షికి ఫోన్ చేసి విషయం తెలిపాడు. ఆమె తిరుపతికి చేరుకుని ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉందని సీఐ చెప్పారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ కట్టడాలను కూల్చివేసిన దృశ్యం

తిరుపతి అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండలం అక్కారంపల్లి గ్రూప్ కొంకచెన్నయ్యగుంట గ్రామ లెక్కదాఖల సర్వేనెంబరు 173/3 లోని ప్రభుత్వం స్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. 20 అడుగుల వెడల్పుతో రోడ్డు చివర స్థలాన్ని గుర్తించిన అక్రమార్కులు ఆదివారం రాత్రే రేకులషెడ్డు నిర్మించారు. సమాచారం అందుకున్న అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి పరిశీలించాలని వీఆర్వోలు ప్రసాద్, స్వర్ణలత, దీనకుమారీలను ఆదేశించారు. వారు అక్కడికి చేరుకుని కట్టడాలను కూల్చడానికి ప్రయత్నించగా అక్రమార్కులు ఎదురుతిరిగారు. పోలీసుల సాయంతో నేలమట్టం చేశారు. ఈ ప్రాంతంలో మిగిలిన అక్రమ కట్టడాల సంగతేమిటని అక్రమార్కులు అధికారులను ప్రశ్నించగా ఫిర్యాదు చేయాలని చెప్పి అక్కడి నుంచి వచ్చేశారు. ఈ విషయమై తహసీల్దార్ భాగ్యలక్ష్మిని వివరణ కోరగా సర్వే నిర్వహించి అక్రమ కట్టడాలను కూల్చివేస్తామన్నారు.

గంగనీరు కలుషితమవుతోంది..పట్టించుకోండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జూన్9(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 34, 44 వార్డుల్లో నాలుగు నెలల క్రితం రోడ్లు పగులకొట్టి అలాగే వదిలేయడం వల్ల తెలుగుగంగ నీరు కలుషితమవుతున్నాయని సీపీఎం నాయకులు వి.నాగరాజు, వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నగర పాలక కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. యశోదానగర్, సుందరయ్యనగర్, సప్తగిరి నగర్ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఉందని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెప్పారు. వెంటనే దృష్టి సారించాలని కమిషనర్ మౌర్యకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆమె వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

శ్మశానానికి స్థలమివ్వాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న వెంకటరత్నం

తిరుపతి(జీవకోన), జూన్ 9(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 50వ డివిజన్ తిమ్మినాయుడుపాళెం హరిజనవాడ శ్మశాన వాటికకు స్థలమివ్వాలని, ప్రత్యామ్నాయ భూమిని ఫారెస్టుకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కాయం వెంకటరత్నం కోరారు. తిరుపతి పర్యటనకు వచ్చిన మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఈ మేరకు గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు నరసింహయాదవ్, ఆర్సీ మునికృష్ణ, కృష్ణయాదవ్, దండు విజయ్ పాల్గొన్నారు.

గోవిందుడి సేవలో డీఎస్పీ



తిరుపతి(నేరవిభాగం), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, సీఐలు శ్రీనివాసులు, రామయ్య సోమవారం గోవిందరాజస్వామి సేవలో తరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవంలో పాల్గొని రథం లాగి భక్తి పారవశ్యాన్ని చాటుకున్నారు. రథం లాగడం పూర్వజన్మ సుకృతమని అన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 9(ఆంధ్రజ్యోతి) : తిరుపతి విద్యుత్‌టౌన్ డివిజన్ పరిధిలోని రవీంద్రనగర్ సబ్‌స్టేషన్, 11కేవీ అక్కారంపల్లి, మంగళం రూరల్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లోడ్‌ను ప్రత్యామ్నాయ మార్గంలోకి బదిలీ చేయడం, విద్యుత్ లైన్ల మరమ్మతులు, కొమ్మల కత్తిరింపు కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ చిన్నకోటి చంద్రశేఖరరావు తెలిపారు. ఈ కారణంగా సంజయ్‌గాంధీ కాలనీ, కొర్లగుంట, ఎర్రమిట్ట, శెట్టిపల్లి సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'రాజకీయ లబ్ధి కోసమే కొమ్మినేని అరెస్టు'

తిరుపతి(జీవకోన), జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసమే జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేశారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్లేషకులు కృష్ణంరాజు మాటలను కొమ్మినేని తప్పుపట్టారని, అయినా ఉద్దేశపూర్వకంగా టీడీపీ, జనసేన నిరసనలు చేయడం సమంజసం కాదని తెలిపారు.

తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్‌ను కలసిన రైటర్



తిరుపతి(నేరవిభాగం), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ రైటర్ బాలసుబ్రమ్మణ్యం తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రైల్వేస్టేషన్‌లో శాంతి భద్రతలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే డీఎస్పీ, సీఐ దృష్టికి తీసుకురావాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, కమిషనర్ మౌర్య తదితరులు

తిరుపతి, జూన్9(ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయం నుంచి రామచంద్ర పుష్కరిణి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ అలవరుచుకుని పాటిస్తే ఆరోగ్యంగా జీవిస్తారని అన్నారు. కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ యోగా ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యకర జీవనం గడపవచ్చునని పేర్కొన్నారు. ఇప్పటి వరకు నగరపాలక సంస్థ పరిధిలో 75 వేల మంది రిజిస్టర్ చేసుకున్నారని, ఈ సంఖ్య లక్షకు పైగా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఏపీయూడీఎఫ్ఐసీ డైరెక్టర్ ఊక విజయకుమార్, కార్పొరేటర్లు నరసింహాచారి, అనిత, నారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు

తిరుపతి(ఆటోనగర్), జూన్9(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారంలో తొలగించిన ఉద్యోగ, కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు జి.బాలసుబ్రమణ్యం, కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ నాలుగువేల మంది కార్మికులను అకారణంగా తొలగించారన్నారు. రెండవ విడతలో 2,600 మందిని తొలగించడానికి రంగం సిద్ధం చేశారని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణలో భాగంగానే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ఉక్కు కర్మాగానికి కేంద్ర ప్రభుత్వం సొంత గనులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ రూపంలో రూ11,440 కోట్లు మంజూరు చేసి, బకాయిల రూపంలో రూ.9,346 కోట్లు తిరిగి తీసుకోవడం వెనుక కుట్ర తేటతెల్లమైందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ కార్మికుల తొలగింపుపై టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. కర్మాగారాన్ని కాపాడుకోవడానికి కలసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, బుజ్జి, మునిరాజా, మాధవ్, ఎన్‌డీ రవి, కేవై రాజా, వెంకటేష్, రామచంద్రయ్య, ప్రమీల పాల్గొన్నారు.

నేడు సైనిక్, నవోదయపై అవగాహనా సదస్సు

తిరుపతి(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వరదరాజ నగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో మంగళవారం సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలపై ఉచిత అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు 4 నుంచి 9వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరుకావొచ్చని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 86888 88802/03, 93999 76999లలో సంప్రదించాలని సూచించారు.

దేశమంతా సైకిల్‌యాత్ర కర్ణాటక భక్తుడి సాహసం



తిరుపతి అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు చెందిన ఓ భక్తుడు భారతదేశమంతా సైకిల్లో సాహస యాత్ర చేస్తూ తన భక్తి ప్రపత్తులను చాటుకుంటున్నాడు. బెంగళూరుకు చెందిన మురుగేష్ ముత్తుకుమార్(59) గత డిసెంబర్ 25న నాల్గో విడత సైకిల్ యాత్రను ప్రారంభించాడు. మూడు రోజుల పాటు ప్రయాణిస్తూ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాడు. అనంతరం శ్రీకాళహస్తి శివుని ఆశీస్సులు పొందాడు. అక్కడి నుంచి తమిళనాడు, నెల్లూరు, ఒంగోలు, హైదరాబాదు, పూణె, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్‌లలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. అదే రాష్ట్రాల మీదుగా తిరుగు ప్రయాణిస్తూ సోమవారం తిరుపతికి చేరుకున్నారు. సాయంత్రం కపిలేశ్వర స్వామిని దర్శించుకున్నాడు. మంగళవారం తిరుమలేశుడిని దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రతినిధులు పలకరించగా ఇప్పటికే నాలుగు విడతలుగా యాత్ర చేశానని, త్వరలో ఐదో విడతగా గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, హర్యాన, జమ్ము అండ్ కాశ్మీర్‌లను సందర్శిస్తే తన చిరకాల వాంఛ నెరవేరుతుందని అన్నారు. తన పిల్లలు ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పాడు.

మంచినీళ్ల గుంటను పరిరక్షించండి

మంత్రిని కోరిన కూటమి నేతలు



తిరుపతి, జూన్9(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన మంచినీళ్ల గుంట కలుషితమైపోయిందని, దాన్ని పరిరక్షించాలని ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్‌లకు కూటమి నాయకులు వినతిపత్రం అందజేశారు. కలుషిత నీరు వలన దాదాపు 70వేల మంది రోగాలబారిన పడుతున్నారని సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో కార్పొరేటర్ నరసింహాచారి నేతృత్వంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి ప్రధాన కారణం స్విమ్స్, రుయా ఆస్పత్రుల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వలన మంచినీళ్ల గుంటకు మురికి నీరు చేరుతోందన్నారు. కలెక్టర్ స్పందిస్తూ తాను నేరుగా మంచినీళ్ల గుంటను సందర్శించి, తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంచినీళ్లగుంట గట్టుపైన ఉన్న గోవిందరాజులు స్వామి విగ్రహం దుస్థితిని మంత్రి సమక్షంలో వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరేంద్ర, నాయకులు వేణుగోపాల్, దూది శివ, పాటకం వెంకటేష్, చినబాబు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 35 వినతులు

తిరుపతి, జూన్9(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. తమ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ అనిల్ కుమార్ కోరారు. సప్తగిరినగర్‌లో రోడ్లు సరిగా లేవని, సుందరయ్య నగర్ శ్మశాన దారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, బృందావన్ నగర్‌కు సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, గొల్లవానిగుంట రోడ్డు, తిమ్మినాయుడు పాలెం రోడ్డులో టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, సినిమా థియేటర్లలో పార్కింగ్ ఫీజును నియంత్రించాలని, సంజీవయ్య నగర్‌లో అక్రమ నిర్మాణాలపై దృష్టి పెట్టాలని, జీవకోన అంబేడ్కర్ కాలనీలో తెలుగుగంగ నీరు సక్రమంగా సరఫరా చేయాలని తదితర సమస్యలు వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, కృష్ణారెడ్డి, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డీసీపీ మహాపాత్ర, దేవికుమారి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి పాల్గొన్నారు.

హెచ్‌సీ కుటుంబానికి ఆర్థిక సాయం



తిరుపతి(నేరవిభాగం), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ గురుస్వామి నాయుడు కుటుంబానికి ఎస్పీ హర్షవర్ధన రాజు సోమవారం ఆర్థిక సాయం అందించారు. ఐఆర్ నిధుల నుంచి లక్ష రూపాయలను ఆయన భార్య బి.పార్వతికి అందజేశారు.

దొంగకు 46 రోజుల జైలుశిక్ష

తిరుపతి(నేరవిభాగం), జూన్ 9(ఆంధ్రజ్యోతి): పలు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తికి 46 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వాణిశ్రీ సోమవారం తీర్పు చెప్పారు. తిరుపతి వెస్ట్ సీఐ మురళీ మోహన్ వివరాల మేరకు ఈ ఏడాది మార్చి 15న స్థానిక త్యాగరాజనగర్‌కు చెందిన రమేష్‌బాబు కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేశారు. అందరూ పడుకుని నిద్రిస్తుండగా మంగళంకు చెందిన దేవరాజులు ఇంటిలోకి చొరబడి 17 గ్రాముల బంగారు నగలు, రెండు మొబైల్ ఫోన్లు దొంగలించుకుని వెళ్లాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి వాణిశ్రీ నిందితుడికి 46 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్లు సీఐ చెప్పారు.

హత్యా.. ఆత్మహత్యా?

ఎలక్ట్రీషియన్ మృతిపై అనుమానాలు



తిరుపతి(నేరవిభాగం), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురంలో ఎలక్ట్రీషియన్ సాయి(26) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. తిరుపతి ఉప్పంగి హరిజనవాడకు చెందిన గూలూరు మంజుల చిన్న కుమారుడు సాయి ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ భార్యాబిడ్డలను పోషిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం చంద్రగిరి మండలం బందార్లపల్లిలో చిన్నమ్మ ఇంట్లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యాడు. రాత్రి తిరుపతి శ్రీనివాసపురంలోని స్నేహితుడు రమేష్ రూముకు వచ్చాడు. రమేష్, మరో స్నేహితుడు గౌతంతో కలిసి మద్యం తాగాడు. మిద్దెమీదకు వెళ్లి పడుకున్నాడు. సోమవారం ఉదయం సాయి పక్కింటి మిద్దెమీద మృతిచెంది ఉన్నాడు. అతని శరీరంపై గాయాలున్నాయి. సాయి కుటుంబ సభ్యులకు అతని స్నేహితులు సమాచారం అందించారు. తల్లి మంజుల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు రమేష్, గౌతంలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

టీటీడీ ఎస్వీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల దాతృత్వం



ప్రిన్సిపాల్ సుమతికి చెక్ అందజేస్తున్న శ్రీ వెంకటేశ్వర హైస్కూల్ పూర్వ విద్యార్థులు


తిరుపతి(విద్య), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీ శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాల 1980వ బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు దాతృత్వాన్ని చాటుకున్నారు. గత ఏడాది 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఇద్దరు ఎస్సీ విద్యార్థులను పాఠశాల 1980 బ్యాచ్ ట్రస్ట్ ఆర్థిక సాయంతో కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ చదివిస్తున్నారు. ద్వితీయ సంవత్సర ఫీజులకుగాను రూ.1.40 లక్షల చెక్కును కళాశాల ప్రిన్సిపాల్ సుమతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఊకా విజయ్‌కుమార్, కార్యదర్శి కోదండరాముడు, కోశాధికారి మన్నవ గంగాధరప్రసాద్, అబులూ, ఖాసి పాల్గొన్నారు.

16 నుంచి టీటీడీ పాఠశాలల్లో 'సద్గమయ'



అధికారులతో మాట్లాడుతున్న ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్9(ఆంధ్రజ్యోతి): టీటీడీ పాఠశాలల్లో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు సద్గమయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో జేఈవో వీరబ్రహ్మం, హెచ్‌డీపీపీ అధికారులతో సోమవారం ఈవో సమీక్ష నిర్వహించారు. టీటీడీకి చెందిన ఏడు పాఠశాలల్లో విద్యార్థులకు దైవభక్తి, నైతిక విలువలు, నిజాయితీ, క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత తదితర అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భగవద్గీత సారాంశాన్ని పిల్లలకు అర్థమయ్యేలా, సరళమైన పదజాలంతో బోధించాలని సూచించారు. శ్రీవారి వైభవాన్ని యువత, పిల్లలకు మరింత తెలిసేలా శిక్షణ ఉండాలన్నారు. టీటీడీకి చెందిన 7, 8, 9 తరగతుల పిల్లలకు తిరుపతిలోని ఎస్‌జీఎస్ హైస్కూల్, ఎస్వీ ఓరియంటల్ హైస్కూల్, ఎస్వీ హైస్కూల్, ఎస్‌కెఆర్ఎస్ ఇంగ్లిషు మీడియం స్కూల్, ఎస్వీ బాలికల పాఠశాల, తిరుమలలోని ఎస్వీ హైస్కూల్, తాటితోపులోని ఎస్‌కెఎస్ హైస్కూల్ పిల్లలకు ఆయా పాఠశాలల్లో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల్లో జరుగుతున్న కార్యక్రమాలపై, స్విమ్స్‌లో అభివృద్ధి పనులపైనా సమీక్షించారు. ఈ సమావేశాల్లో హెచ్‌డీపీపీ కార్యదర్శి రఘునాథ్, అన్నమాచార్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి మేడసాని మోహన్, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, సీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.



తెప్పపై పద్మావతీదేవి అభయం



తిరుచానూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోమవారం పద్మసరోవరంలో అమ్మవారు తెప్పపై విహరించి భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం 6.30గంటలకు ఉత్సవమూర్తిని పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేసి పూజలు నిర్వహించి తెప్పపై అధిష్ఠింపచేశారు. అనంతరం పుష్కరిణిలో మూడు చుట్లు అమ్మవారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం నాలుగు మాడ వీధుల గుండా ఊరేగుతూ ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు, అర్చకులు పాల్గొన్నారు. తెప్పోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి గజవాహన సేవ జరగనుంది.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లు సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 90,802

తలనీలాలు సమర్పించినవారు: 35,776



మహారథంపై గోవిందుడు





తిరుపతి అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): భక్తజన సందోహం మధ్య సోమవారం ఉదయం తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి మహారథోత్సవం జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజు ఉదయం 6.15గంటలకు ప్రారంభమైన రథోత్సవం కర్నాలవీధి, బేరివీధి, గాంధీరోడ్డుల మీదుగా యథాస్థానమైన రథమండపానికి చేరుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై గోవిందన్నామ స్మరణలతో రథాన్నిలాగారు. ఆ సమయంలో ట్రాఫిక్‌ను మళ్లించి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్ల మధ్య మహారథోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించగా, రాత్రి అశ్వవాహనంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఉత్సవాలలో జీయ్యంగార్లు, ఎఫ్ఏఅండ్ సీఏవో బాలాజీ, ఎస్ఈ 2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవో శాంతి, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, భక్తులు పాల్గొన్నారు. కాగా మంగళవారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో గోవిందుడి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలి

అధికారులకు జేసీ శుభం బన్సల్ ఆదేశం ● పీజీఆర్ఎస్‌కు 242 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అధికారులకు అందే ప్రతి అర్జీకి త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా అధికారులను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేసి తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలను అందజేశారు. వివిధ సమస్యలపై ప్రజలు 242 అర్జీలు అందజేయగా అందులో వివిధ భూసమస్యలపై రెవెన్యూ 129 ఫిర్యాదులు అందడం గమనార్హం. డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన వారిలో ఉన్నారు.

చిగురువాడ పంచాయతీలో నిధుల దుర్వినియోగం



తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని, దీనిపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు వార్డు సభ్యుడు కిరణ్ కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ విషయాన్ని సోమవారం ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బాధ్యులపై ఇంత వరకు చర్యలు లేవని, ఇప్పటికైనా నిధులు దుర్వినియోగం చేసిన అధికారులు, సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. సర్పంచ్ బారి నుంచి పంచాయతీని కాపాడాలని కలెక్టరేట్‌లో ప్లకార్డు ప్రదర్శించి నిరసన తెలిపారు.

కాలు పోయింది.. పింఛను ఇప్పించండి



రత్నమయ్య, వెంకటగిరి

'నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో ఓ కాలు కోల్పోయాను. దీంతో దివ్యాంగుడిగా మిగిలిపోయాను. నేను కూలీ పనికి వెళితేకాని కుటుంబం గడవదు. మా కుటుంబ పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రభుత్వం పింఛను ఇప్పించి ఆదుకోవాలి' అని వెంకటగిరికి చెందిన రత్నమయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 94 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీఐలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 94 ఫిర్యాదులు అందాయి. తొలుత అర్జీదారులు తమ ఫిర్యాదులను రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత సంబంధిత సర్కిళ్ల సీఐల వద్దకు వెళ్లారు. అక్కడ ఫిర్యాదులకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత అదనపు ఎస్పీల వద్దకు పంపారు. అక్కడ సమగ్రంగా దర్యాప్తు చేసి ఫిర్యాదులో ఉన్న ప్రధాన అంశాలను విచారించి వీలైనంత వరకు అక్కడికక్కడే పరిష్కారమయ్యే సమస్యలను పరిష్కరిస్తున్నారు. కొంత క్రిటికల్‌గా వున్న ఫిర్యాదులను ఎస్పీ హర్షవర్ధనరాజు వద్దకు పంపి విచారించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ఇలా సోమవారం వచ్చిన అర్జీల్లో 56 శాతం వరకు పరిష్కారమయ్యాయి. ప్రతి సోమవారం నిర్వహించే పోలీసు పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం ఉండకూడదని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, సీఐలు, పోలీసులు పాల్గొన్నారు.



సింహ వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు

సింహ,ముత్యపు పందిరి వాహనాలపై
శ్రీనివాసుడి విహారం

వడమాలపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం అప్పలాయగుంటలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సింహ వాహనంపై స్వామివారు నరసింహస్వామి అలంకారంలో ఊరేగారు. అనంతరం పద్మావతీ అండాల్ సమేతంగా స్వామివారికి స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల సేవ జరిగింది. రాత్రి భోగశ్రీనివాసమూర్తిగా స్వామివారు ముత్యపుపందిరి వాహనంపై ఆశీనుడై మాడవీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4.30-6.30 గంటల మధ్య ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. భక్తులు రూ.500 చెల్లించి సంప్రదాయ దుస్తులతో పాల్గొనాల్సి ఉంది.



ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

ఎన్టీఆర్, ముద్దుకృష్ణమ కాంస్య విగ్రహాల ఆవిష్కరణ



ముద్దుకృష్ణమ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే - ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తూ..

పుత్తూరు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో ఏర్పాటు చేసిన టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్.. ముద్దుకృష్ణమ కాంస్య విగ్రహాలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సోమవారం ఆవిష్కరించారు. ముద్దుకృష్ణమ 79వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు రెండు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహానేతల సేవలను స్మరించుకున్నారు. అనంతరం చిన్నారి చేతుల మీదుగా కేక్ కట్ చేయించి మహిళలకు పంచి పెట్టారు. అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ.. ముద్దుకృష్ణమ సేవాతత్వం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజా సేవకుడిగా, నిరాడంబరతకు ప్రతీకగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. 1985లో విద్యాశాఖ మంత్రిగా ప్రతి గ్రామంలో ఒక పాఠశాల ఉండాలన్న సంకల్పానికి శ్రీకారం చుట్టారన్నారు. దీని ఫలితమే నాటి విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి నేడు పెద్ద పెద్ద స్థానాల్లో స్థిరపడడానికి దోహదపడిందన్నారు. ఆయన మరణించి ఏడేళ్లు కావస్తున్నా.. విగ్రహావిష్కరణకు పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు రావడమే.. ప్రజల మదిలో ఆయన పదిలంగా నిలిచిపోయారనడానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు గాలి జీవరత్నం నాయుడు, ఎన్.ఎస్.ధనపాల్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ వాసు, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఆర్ యుగంధర్, గాలి గోపినాథ్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ రెప్రజెంటేటివ్‌పై హత్యాయత్నం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గతంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదానికి సంబంధించి కారు యజమానిపై గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన త్యాగరాజనగర్ వద్ద చోటు చేసుకుంది. డీఎస్పీ భక్తవత్సలం కథనం మేరకు.. చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం ప్రాంతానికి చెందిన మెడికల్ రెప్రజెంటేటివ్ నిరంజన్ నాయుడు 2024లో చంద్రగిరి మండలం ఐతేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో సోమవారం తిరుపతి కోర్టుకు హాజరయ్యారు. వాయిదా చూసుకుని తిరిగి కారులో వెళుతుండగా త్యాగరాజనగర్ వద్ద దుండగులు రాడ్లు, కత్తులతో అతడిపై దాడి చేశారు. తల, కాళ్లు, చేతులపై బలమైన గాయాలయ్యాయి. ఈ ఘటనలో నిందితులు పరారయ్యారు. దీనిపై బాధితుడు నిరంజన్ నాయుడు తిరుపతి వెస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యాయత్నానికి పాల్పడింది ఎవరు? అందుకుగల కారణాలేమిటనే విషయాలపై సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను అరెస్టు చేస్తామని డీఎస్పీ చెప్పారు.



గాయపడిన నిరంజన్

గత నెల 1757.. ఇప్పుడు 3307 యూనిట్లు

అదానీ స్మార్ట్ మీటర్లతో హడలిపోతున్న విద్యుత్తు వినియోగదారులు

పాకాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అదానీ స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వినియోగదారులు హడలిపోతున్నారు. స్మార్ట్ మీటర్లు బిగించాక రెట్టింపు బిల్లులు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ వినియోగం పెరగకున్నా బిల్లులు అధికమొత్తంలో వస్తుండడంతో చార్జీల భారం మోయలేమని వాణిజ్య, పరిశ్రమల విద్యుత్ వినియోగదారులు అంటున్నారు. ఇటీవల పాకాల మండలంలో వాణిజ్య వినియోగదారులకు అదానీ స్మార్ట్ మీటర్లు అమర్చారు. ఈ నెలలో వచ్చిన బిల్లులు చూసి లబోదిబోమంటున్నారు. ఉదాహరణకు పాకాల ఆపరేషన్ పరిధిలో త్రీ ఫేజ్ వాణిజ్య సర్వీసు నెం.5426111005115 గత 23 నెలల్లో విద్యుత్ వినియోగం సరాసరి నెలకు 1617 యూనిట్లు వినియోగమైంది. అత్యధికంగా ఒక నెలలో 25,963 రూపాయలు, అత్యల్పంగా ఒక నెలలో 16,732 రూపాయలు బిల్లు చెల్లించారు. స్మార్ట్ మీటర్ బిగించకముందు ఏప్రిల్ నెలలో 1757 యూనిట్లు వినియోగించి రూ.23,326 బిల్లు చెల్లించారు. స్మార్ట్ మీటరు బిగించాక మే నెలకు సంబంధించి ఒక్కసారిగా 3,307 యూనిట్లు వినియోగించారని, రూ.38,136 చెల్లించాలని బిల్లు వచ్చింది. వాడకం పెరగకపోయినా స్మార్ట్ మీటర్‌తో 1550 యూనిట్లు అదనంగా బిల్లులో చూపించి గత నెలకంటే రూ.14,810 ఎక్కువ రావడంతో వ్యాపారం ఎలా కొనసాగించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత మీటరు ఉన్నప్పుడు పవర్ ఫ్యాక్టర్ 0.91, 0.88 వుండగా అదానీ స్మార్ట్ మీటర్‌తో పవర్ ఫ్యాక్టర్ 0.4 వచ్చింది. దీంతో యూనిట్లు పెరిగి బిల్లు అధిక మొత్తంలో వచ్చినట్లు తెలుస్తోంది. పాతమీటర్లతో రూ.300-400 వచ్చే బిల్లులు స్మార్ట్ మీటర్లతో 800-1000ల వరకు వస్తున్నాయని చిరువ్యాపారులు వాపోతున్నారు. స్మార్ట్ మీటర్ల పనితీరును పరిశీలించకనే పాత మీటర్ల స్థానంలో బిగించి వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు తొలగించి పూర్వం వున్న మీటర్లను బిగించాలని విద్యుత్ వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాదాల మండపం ఆధునికీకరణ!

అనుమతుల కోసం ఏఎస్ఐకు టీటీడీ లేఖలు
మరో రెండురోజుల్లో పరిశీలించనున్న ఆర్కియాలజీ అధికారులు



తిరుమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ అలిపిరిలోని అతి పురాతన పాదాల మండపం ఆధునికీకరణపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) సహకారంతో శిథిలావస్థలో ఉన్న ఈ మండపం పరిరక్షణకు చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. వైసీపీ సర్కారులోని అధికారులు తిరుమలలోని అతి పురాతనమైన పార్వేటమండపాన్ని పూర్తిగా తొలగించి, కొత్తగా కట్టడంపై తీవ్రస్థాయిలో విమర్శలకు దారితీసిన విషయం తెలిసిందే. ఆర్కియాలజీ అనుమతి లేకుండా మండపాన్ని ఎలా తొలగిస్తారంటూ అప్పట్లో బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే అంశంపై ఎంపీ లక్ష్మణ్ రాజ్యసభలో ప్రసంగించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అలాగే అలిపిరి పాదాల మండపాన్ని కూడా పూర్తిస్థాయిలో కూలదోసేందుకు టీటీడీ అధికారులు సిద్ధమయ్యారంటూ 2023 నవంబరులో బీజేపీ నేత భానుప్రకాష్ మండిపడ్డారు. పురంధేశ్వరి కూడా పాదాల మండపాన్ని అదే నెల్లో సందర్శించి పురావస్తుశాఖ ఆధ్వర్యంలోనే పాదాలమండపం పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పాదాలమండపంపై టీటీడీ ప్రత్యేక దృష్టిసారించింది. శిథిలావస్థకు చేరిన మండపాన్ని తిరిగి పరిరక్షించేందుకు సహకారమివ్వాలంటూ ఏఎస్ఐకు విన్నవించారు. కాకతీయ కట్టడాలను పురాతన పద్ధతుల్లో ఎలా పరిరక్షించారో అదే తరహాలో టీటీడీ పురాతన కట్టడాలను పరిరక్షించి భావితరాలను అందించాలనే టీటీడీ విజ్ఞప్తి మేరకు ఆర్కియాలజీ విభాగం టీటీడీ చైర్మన్, ఈవోలతో కలిసి మరో రెండురోజుల్లో స్వయంగా పాదాలమండపాన్ని పరిశీలించనుంది. ఇప్పటికే మండపం పనులకు సంబంధించి ఏఎస్ఐ సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. కాగా, మండపం పరిరక్షణ పనులకు ఇప్పటికే పలువురు దాతలు ముందుకు వచ్చినట్టు సమాచారం. రూ.కోటి నుంచి కోటిన్నర వరకు అయ్యే ఖర్చును చెల్లించేందుకు సిద్ధమయ్యారు.

అదానీ కంపెనీలో ఉద్యోగాల పేరిట మోసం

● ముగ్గురు కడపవాసులపై కేసు


తిరుపతి(నేరవిభాగం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా పనిచేస్తున్న అదానీ కంపెనీలో ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసిన ముగ్గురు కడపవాసులపై తిరుపతి పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఆ కంపెనీ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ లీలాకృష్ణమోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. అదానీ ఇన్‌ఫ్రా కంపెనీలో విజయవాడకు చెందిన లీలాకృష్ణమోహన్ కో ఆర్డినేటర్ హెడ్‌గా పనిచేస్తున్నారు. స్మార్ట్ మీటర్ల నేపథ్యంలో తాజాగా కొంతమందిని ప్రాజెక్టు టీమ్ లీడర్‌లుగా తీసుకున్నారు. ఇందులో కడపకు చెందిన కవలకుంట్ల జయచంద్రారెడ్డి, విద్యాసాగర్, కవలకుంట్ల విద్యాసాగర్ ఉన్నారు. కంపెనీ కోసం కొంతమందిని తీసుకోవడానికి వీరికి అధికారమిచ్చారు. ఈ క్రమంలో వీరు ఉద్యోగాల కోసం ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. ఇలా రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఈ మేరకు లీలాకృష్ణమోహన్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

బత్తినయ్య కోనకు 'కన్నప్ప' బృందం



మోహన్‌బాబు

ఏర్పేడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం ముసలిపేడు సమీపంలోని బత్తినయ్యస్వామి కోనకు సోమవారం 'కన్నప్ప' యూనిట్ వచ్చింది. ఈ సందర్భంగా మోదుగులపాళెం, ముసలిపేడు గ్రామస్తులు వీరికి ఘనస్వాగతం పలికారు. అనంతరం మోహన్‌బాబు, మంచు విష్ణు, శివబాలాజీ బత్తినయ్యస్వామి కోనకు వెళ్లి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కోలా ఆనంద్, షైలం దయాకర్, మంచు సుధాకర్‌నాయుడు, మంచు మస్తాన్‌నాయుడు, పులిపాటి చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న మంచు విష్ణు, శివబాలాజీ

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా


ఆర్డీవో కార్యాలయం గ్రీవెన్స్‌లో ఉదయం 10:40 గంటలకు మూడు శాఖల అధికారులే హాజరు, ఖాళీగా ఉన్న కుర్చీలు

సూళ్లూరుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు డుమ్మా కొడుతున్నారు. పలు శాఖల అధికారులు మొక్కుబడిగా హాజరవుతున్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్నాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించాలి. సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదకకు డివిజన్ స్థాయి అన్ని శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉంది. పట్టుమని నాలుగైదు శాఖలకు సంబంధించిన అధికారులే హాజరవుతున్నారు. కొందరు అధికారులు 12 గంటలకు కూడా రావడం లేదు. పోలీస్, ఎక్సైజ్, ఫారెస్ట్, విద్యుత్తు, ఇరిగేషన్ శాఖల నుంచి అధికారులెవరూ గ్రీవెన్స్‌కు హాజరుకావడం లేదు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పనిసరిగా గ్రీవెన్స్ నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలని కలెక్టర్ ఆదేశాలిచ్చినా పట్టించుకోవడంలేదు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి

గూడూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం పూర్తయిన నేథ్యంలో 12న స్థానిక సంగం థియేటర్ సెంటర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు విజయోత్సవ ర్యాలీని నిర్వహిస్తామన్నారు. కూటమి పార్టీల నాయకులు జయప్రదం చేయాలన్నారు.

వేదోక్తంగా
మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి మహా మంగళహారతి సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో
కార్మికుల తొలగింపు ప్రక్రియ ఆపాలి

ఏర్పేడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియను వెంటనే ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకుడు రంగయ్య మాట్లాడుతూ... ఎన్నో ప్రాణ త్యాగాలతో ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్రప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు అడుగులు వేయడం హేయమన్నారు. ఈ నేపథ్యంలో 5,400మంది కాంట్రాక్టు కార్మికులను దశల వారీగా తొలగించేందుకు చర్యలు చేపట్టడం బాధాకరమన్నారు. ఇప్పటికే 3వేల మంది కార్మికులను తొలగించి వారి కడుపు కొట్టారన్నారు. మిగిలిన వారిని కూడా తొలగించేపనిలో ఉందన్నారు. వెంకటాద్రి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


బీఎన్‌కండ్రిగలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సచివాలయ సిబ్బంది

ఏర్పేడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక స్థితి మెరుగుపడుతుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. మండలంలోని బండారుపల్లిలో సోమవారం ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. నాయకులు సుబ్రహ్మణ్యంయాదవ్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పాపానాయుడుపేట కేంద్రంలో ఎంపీడీవో సౌభాగ్యం ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మురగయ్య, సర్పంచు లలితా కరుణకార్, టీడీపీ నాయకులు కృష్ణప్పమొదలియార్, రోశయ్య, అర్జున్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంఈవో రవీంద్రనాథ్, ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. బీఎన్ కండ్రిగ పట్టణంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. యోగా మనిషి జీవితంలో భాగం కావాలని చెప్పారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆయుష్షును పెంచుకోవచ్చని ప్రత్యేకాధికారి రాధారాణి అన్నారు. ఎంపీడీవో కార్యాలయం కార్యాలయం నుంచి గ్రామంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, పంచాయతీరాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): యోగాపై ప్రజల్లో అవగాహన కల్పించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతామని ఎంపీడీవో మహ్మద్‌రఫీ పిలుపునిచ్చారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో యోగాపై అవగాహన సదస్సు జరిగింది. తహసీల్దార్ టి.వి.సుబ్రహ్మణ్యం, డాక్టర్లు రాజేష్, మునిచరిత, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని ఎంపీడీవో బాలాజీ నాయక్ తెలిపారు. సోమవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్‌కుమార్, ఏపీవో సుధాకర్, ఏఎస్ఐ రవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, నాయకులు శ్రీనివాసయాదవ్, శ్యామ్, మదన్మోహన్, దేశప్పన్ తదితరులు పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి కార్మికుడి మృతి

రేణిగుంట, జూన్ 9, (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి కార్మికుడు మృతి చెందినట్లు గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. గాజులమండ్యం పారిశ్రామికవాడలోని పీటీసీఎల్ కర్మాగారంలో నేపాల్‌కు చెందిన లేక్ రాజ్ (45) విధులు నిర్వహిస్తూ, సమీపంలోని కార్మికులతో కలిసి ఉంటున్నాడు. ఇటీవల రెండు వారాలుగా విధులకు వెళ్ళకుండా మద్యం తాగుతున్నారు. ఆదివారం రాత్రి రూమ్ లోనే రక్తపు వాంతులు చేసుకొని మృతి చెందాడు. సోమవారం కార్మికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీకాళహస్తి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవల నాయీ బ్రాహ్మణుడు మంగళంపాడు రామ్మూర్తి ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కొత్తపట్నం మహేంద్ర సోమవారం రామ్మూర్తి గృహానికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం చేశారు. సభ్యులు వెంకటముని, బాలసుబ్రహ్మణ్యం, సురేష్, మునివెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సూళ్లూరుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం స్థానిక రోటరీక్లబ్ హాలులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగానే టైలరింగ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తోందన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, మాధవనాయుడు, పర్వత రెడ్డి చంద్రారెడ్డి, ఏలిమేటి సతీష్, ఏజీ కిషోర్, అలవల శ్రీనివాసులు, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య

ఓజిలి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగొద్దని మందలించినందుకు ఓజిలి మండలం భువనగిరిపాళెం గ్రామానికి చెందిన రాజాబాబు(51) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ స్వప్న తెలిపారు. తాగుడుకు బానిసైన రాజాబాబును కుటుంబ సభ్యులు రెండు రోజుల కిందట మందలించారు. దీంతో పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు



విన్నమాల రోడ్డులోకి చొచ్చుకొచ్చిన దుకాణాలు - అక్రమ కట్టడాలు

ఒకప్పటి జాతీయ రహదారి!

- ఆక్రమణదారుల చెరలో విన్నమాల రోడ్డు
- ప్రభుత్వ కార్యాలయాలకు అదేదారి
- నిత్యం రాకపోకలు సాగిస్తున్న అధికారులు
- కుచించుకుపోతున్నా పట్టించుకోని వైనం

నాయుడుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట నుంచి విన్నమాలకు వెళ్లే రోడ్డు దాదాపు 35 సంవత్సరాల కిందట చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారిగా ఉండేది. ఈ మార్గంలో నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, విశాఖపట్నం, కోల్‌కత్తా ప్రాంతాల నుంచి వాహనాలు చెన్నై వెళ్లేవి. కాలక్రమంలో బైపాస్ రోడ్డు, ఫ్లైఓవర్ బ్రిడ్జి రావడంతో విన్నమాల రోడ్డులో రాకపోకలు తగ్గాయి. అయితే ఈ మార్గంలోనే జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, డివిజనల్ ట్రజరీ, డీఎస్పీ, తహసీల్దారు తదితర కార్యాలయాలకు అధికారులతో ప్రజలూ రాకపోకలు సాగిస్తుంటారు. అంతటి ప్రాధాన్యం గల విన్నమాలరోడ్డు ఆక్రమణలతో కుచించుకుపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో జాతీయ రహదారి కాస్త చిన్నవీధిలా మారిపోయింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డు మొత్తం జలమయంగా మారుతోంది. అధికారులు స్పందించి విన్నమాల రోడ్డులో ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఉంది.

యోగా సాధనతో ఒత్తిడిలేని ఆరోగ్యకర జీవనం



యోగాంధ్ర ర్యాలీలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగా చేయడం ద్వారా ఒత్తిడిలేని, ఆరోగ్యకర జీవనం సాగించవచ్చని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. ఏకాగ్రత పెరగడంతో పాటు అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన అలవాటుగా చేసుకోని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ నెల 21న యోగా డే సందర్భంగా విశాఖపట్నంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో 5 లక్షల మందితో యోగా సాధన చేస్తారన్నారు. అదే రోజు స్థానిక ఏఎరెడ్డి స్టేడియంలో యోగా కార్యక్రమం నిర్వహించనున్నామని, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచు రామయ్య, అబ్దుల్‌రహీం, మట్టం శ్రావణి, నటశేఖర్, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, ఆరికట్ల మస్తాన్ నాయుడు, డాక్టర్ రమణయ్య, కట్టా మురళీకృష్ణ, రాజా, క్రీడాకారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయశ్రీ, ఆర్డీవో కిరణ్మయి, - గూడూరు డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, అధికారులు

పేదరికం లేని సమాజం కోసమే స్వర్ణాంధ్ర విజన్-2047

సూళ్లూరుపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో పేదరికం లేని సమాజం.. 2047 నాటికి నూరుశాతం అక్షరాస్యత వంటి సమున్నత లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 పేరుతో ఒక దార్శనిక పత్రాన్ని రూపొందించిందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో కిరణ్మయి, నియోజవకర్గంలోని అన్ని మండలాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దులుగా చేసుకుని సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ దార్శనిక పత్రాన్ని విడుదల చేశారన్నారు. విజన్ ద్వారా నియోజకవర్గ స్థాయిలో ఒక పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేసి నిరుద్యోగాన్ని రూపుమాపడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి పేదరికంలేని సమాజం కోసం ముందుచూపుతో ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్-2047ను రూపుపొందించిందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి స్వర్ణాంధ్ర కలను సాకారం చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు పాల్గొన్నారు.

గూడూరు: విజన్ 2047పై స్పష్టమైన విధానాలతో యాక్షన్ ప్లాన్‌ను రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ కలెక్టర్ సుధారాణి తెలిపారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మధుసూదన్‌రావు, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్, ఇరిగేషన్ ఏఈ సురేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డు


ప్రభుత్వ భూమిలో
రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

పెళ్లకూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన కాలవ పోరంబోకు భూముల్లో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. మండలంలోని ఎర్రగుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 235లో 14.30 ఎకరాల కాలువ పోరంబోకు భూమి ఆక్రమణకు గురైనట్లు తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డికి ఫిర్యాదులు అందాయి. ఆయన ఆదేశాలతో మండల సర్వేయర్ పూజిత, వీఆర్వో రమేష్ భూములను పరిశీలించి నివేదిక ఇచ్చారు. సోమవారం సదరు భూముల్లో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ


గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, జేవీవీ సభ్యులు

గూడూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రామ్మోహన్ దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, జేవీవీ పట్టణ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, రామ్మోహన్, చెంచునారాయణ, పురుషోత్తమరావు, ప్రభాకర్, సుమన్, సురేష్, ఇబ్రహీం, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

చంద్రగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువరెడ్డివారి పల్లెలో యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చంద్రగిరికి చెందిన హర్షిణి(25)కి ఎగువరెడ్డివారిపల్లెకు చెందిన నవీన్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. నవీన్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం భర్త తిరుపతికి వెళ్లగా ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో హర్షిణి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జరుగుమల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత విష గుళికలు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష గుళికలు తిని అపస్మారకస్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

డక్కిలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు మొక్కలే ఆధారమని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సోమవారం ఆయన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న రాణి, సర్వేయర్ పూజిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవార్డులు


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

కోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రగతి విద్యాసంస్థల విద్యార్థులను అవార్డులు వరించాయి. పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ పేరిట అవార్డులను ప్రకటించింది. సోమవారం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రగతి విద్యాసంస్థలకు చెందిన సాత్విక్, అశ్విత, రిత్విక్, శ్రీకృష్ణను షీల్డ్‌లతో అభినందించారు. ఒక్కొక్కరికి రూ.20వేల నగదు పురస్కారాలను అందించారు.

డ్రోన్ సర్వే

కోట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్లపూడి, సిద్ధవరం పంచాయతీల్లో భూములను సోమవారం డ్రోన్ ద్వారా సర్వే చేశారు. వీఆర్వో శ్రీనివాసులు ఆధ్వర్యంలో సర్వేయర్ల బృందం డ్రోన్‌లతో సర్వే చేసి వివరాలను సేకరించారు. ఆయా పంచాయతీల్లో ఉన్న భూములను పరిశ్రమలకు కేటాయించనున్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలి

గూడూరు అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషిచేయాలని ఆ సంఘ నాయకుడు దేవదాసు అన్నారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినాన్ని పురస్కరించుకుని నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిసింద్రి, శివ, విజయలక్ష్మి, మస్తాన్, వెంకటేశ్వర్లు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఎఫ్ఎస్ భూముల పరిశీలన


భూముల లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చంద్రశేఖరపురం చెరువు సమీపంలో ఉన్న సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములను సోమవారం తహసీల్దారు జయజయరావు పరిశీలించారు. ఇక్కడ డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములు పెద్దల చేతుల్లో ఉన్నాయంటూ రెండు రోజుల క్రితం 'ప్రభుత్వ భూముల్లో పెద్దలపాగా' అన్న వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. చెరువు లోతట్టు భాగంలో ఉన్న గూడలి బీట్-2 పంచాయతీ సర్వే నెంబరు 249-2, 291-3లో ఉన్న డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములను సర్వేయర్ బృందంతో వెళ్లి పరిశీలించారు. ఆయా ప్రభుత్వ భూముల్లో ఎవరెవరు లబ్ధిదారులు ఉన్నారో ఆరా తీశారు. ఆయన వెంట మండల సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, విలేజ్ సర్వేయర్లు ఉన్నారు.

సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలి

డక్కిలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని వెంకటగిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని ఆల్తూరుపాడు గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు నిమ్మ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్త బండెప్ప మాట్లాడుతూ కృషి విజ్ఞన కేంద్రం విధులు, భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యం, యంత్ర పరికరాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారంలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడడం మంచిపద్ధతి కాదన్నారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకునేంతవరకు పోరాటాలు సాగిస్తామన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీవీరమణయ్య, శంకరయ్య, రమేష్, భాస్కర్‌రెడ్డి, నారాయణ, ముత్యాలయ్య, చంద్రయ్య, అశోక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను నిలిపివేయాలి

వెంకటగిరిటౌన్, జూన్9(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణను నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య అన్నారు. సోమవారం తహసీల్దార్ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమలో అక్రమంగా తొలగించిన 4500మంది కాంట్రాక్టు కార్మికుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంజుల, సుబ్రహ్మణ్యం, పెంచలయ్య, నారాయణ, రత్నమ్మ, నవీన్, చందు, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోండి

నాయుడుపేట టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమలో అక్రమంగా తొలగించిన 4500మంది కాంట్రాక్టు కార్మికుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు శివకవి ముకుంద డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలోని సీనియర్ సహాయకురాలు స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అబ్దుల్లా, వెంకయ్య, సుబ్బయ్య, ముత్యాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గూడూరు అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెర్నూరు గ్రామంలో సోమవారం తిరుపతిలోని వెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (సిమ్స్) ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే సులభంగా నయం చేసుకోవచ్చునన్నారు. మంగళవారం చెన్నూరు గ్రామంలో క్యాన్సర్ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుగంగ కాలువపై షట్టర్ ఏర్పాటు



శ్రీకాళహస్తి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ కాలువలో ఇటీవల కొట్టుకుపోయిన షట్టర్ స్థానంలో అధికారులు కొత్త దానిన్ని ఏర్పాటు చేశారు. గత నెల 23న తొట్టంబేడు మండలం కల్లిపూడి వద్ద తెలుగు కాలువ వద్ద ఓ షట్టర్ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీనిపై గత నెల 24న ఆంధ్రజ్యోతి దినపత్రికలో కొట్టుకు పోయిన 'తెలుగుగంగ కాలువ షట్టర్ - గత వైసీపీ పాలనలో కనీస మరమ్మతుల విస్మరణ' అన్న కథనం ప్రచురితమైంది. దీనిపై తెలుగు గంగ అధికారులు స్పందించారు. షట్టర్ కొట్టుకు పోయిన ప్రాంతాన్ని ఈఈ రత్నారెడ్డి అధికారు లతో కలిసి పరిశీలించారు. కొత్త షట్టర్ ఏర్పాటు కోసం రూ.9.70లక్షలు అవసరమని అంచనా వేశారు. ఈ మేరకు ఆ నిధులు మంజూరు కావడంతో సోమవారం కొత్త షట్టర్‌ను కల్లిపూడి వద్దకు చేర్చారు. క్రేన్ సాయంతో షట్టర్ ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో ఆ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్నారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్‌మార్టిన్, జనార్దన రెడ్డి, ఏఈలు అనిత, మునిరాజా, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో చిత్తడైన వారపు సంత



కేవీబీపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన మోస్తరు వర్షానికి వారపు సంత చిత్తడిగా మారింది. ప్రధాన రహదారిపై మోకాలి లోతు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీరు వెళ్లడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేసిన కాలువను కొంతమంది పూడ్చి వేశారు. దీంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో వర్షం పడిన ప్రతిసారీ శ్రీకాళహస్తి - పిచ్చాటూరు ప్రధాన రహదారిపై మోకాలి లోతు నీరు నిల్వ చేరుతోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకుని నీరు నిల్వ లేకుండా చూడాల్సి ఉంది.

పతాకావిష్కరణ



శ్రీకాళహస్తి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య 42వ వార్షికోత్సవం సందర్భంగా అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ రూపొందించిన పతాకాన్ని కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అర్చక విభాగ అధ్యక్షుడు పాలూరి నరసింహమూర్తి తితరులు పాల్గొన్నారు.

ఘనంగా రిషితారెడ్డి జన్మదిన వేడుకలు



శ్రీకాళహస్తి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఊరందూరులోని వారి స్వగృహంలో ఎమ్మెల్యే, బృందమ్మ సమక్షంలో ఆమె కేక్ కట్ చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మిన్నల రవి, మునిరాజాయాదవ్, బాలజీరెడ్డి, వజ్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు. 32వ వార్డు పరిధిలో షేక్ షఫీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ , రమేష్, షాకీరాలీ, బషీర్, ఆర్ముగం, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ మురళీధర్‌రెడ్డి తెలిపారు. బీఎన్‌కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 60 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తం తక్కువగా ఉన్న గర్భిణులకు సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇచ్చారు. మొదటి కాన్పు వారు వారి బ్యాంకు అకౌంట్, ఆధార్ మరియు మొబైల్ నెంబర్‌తో ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కొరకు నమోదు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రూ. 5వేలు బ్యాంకు ఖాతాలో జమచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎంల బాధ్యతల స్వీకరణ

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మోడల్ ప్రైమరీ పాఠశాలలకు చెందిన 17 మంది హెచ్‌ఎంలు బాధ్యతలు స్వీకరించినట్టు ఎంఈవోలు రవీంద్రనాథ్ , మునిసుబ్రమణ్యంలు తెలిపారు. పుత్తేరి, పీవీకండ్రిగ, పార్లపల్లి, పల్లమాల, కాటూరు, నక్కవారికండ్రిగ, జీఎన్‌కండ్రిగ, లక్ష్మీపురం, కనమనంబేడు, బీఎన్‌కండ్రిగ, నీర్పాకోట గిరిజన కాలనీ, గాజులపెళ్ళూరు గిరిజన కాలనీ, కారణి, వెస్ట్‌వరత్తూరు, నెలవాయి, వేణుగోపాలపురం దళితవాడ, కల్లివెట్టుల్లో మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటయ్యాయి.

పుత్తూరు వార్తలు

అమరావతి మహిళలకు సాక్షి టీవీ క్షమాపణలు చెప్పాలి



వడమాలపేటలో తెలుగు మహిళల నిరసన

వడమాలపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై, ఆ ప్రాంత మహిళలను కించపరిచేలా ప్రసారం చేసిన సాక్షి మీడియా మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న డిమాండ్ చేశారు. వడమాలపేటలో సోమవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సాక్షి మీడియాలో కొమ్మినేని శ్రీనివాసరావు నిర్వహించిన లైవ్ డిబేట్లో జర్నలిస్టు, విశ్లేష కుడు కృష్ణంరాజు రాజధాని అమరావతి ప్రాంత మహిళలను వేశ్యలుగా పేర్కొంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. అమరావతిని, అక్కడి మహిళలని కించ పరుస్తూ జుగుప్సాకరంగా మాట్లాడిన వారు సభ్య సమాజంలో జీవించడానికి అనర్హులని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ నివాస ముంటున్న తాడేపల్లి ప్యాలెస్ రాజధాని పరిధి లోనే ఉండడాన్ని వైసీపీ నాయకులు మరచి పోయారన్నారు. ప్రజాగ్రహంతో ప్రతిపక్ష హోదా కూడా కోల్పోయి సాక్షి మీడియాతో విషం కక్కించే ప్రయత్నం చేస్తున్నారని మండి పడ్డారు. తక్షణం సాక్షి ఛానల్‌లో ప్రసార బాధ్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, హేమావతి, రజని, మోహన, వెంకటయ్య, రవిరెడ్డి, గురునాథం శెట్టి, కుమార్, వినోద్, చైతన్య, దూర్వాసులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

వడమాలపేట,జూన్ 9(ఆంధ్రజ్యోతి):యోగా సర్వ రోగ నివారిణి అని నినాదాలు చేస్తూ వడమాలపేటలో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రితేష్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ఎంపీడీవో శేషగిరిరావు, వెలుగు ఏపీఎం మునికృష్ణారెడ్డి, డ్వాక్రా సభ్యులు, టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, ఢిల్లీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం పుత్తూరు పట్టణంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవన శైలి మార్పులతో ఆరోగ్యం పదిలం

పుత్తూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వయస్సు పెరిగే కొద్దీ జీవన శైలిలో మార్పులు చేసుకుంటే ఆరోగ్యంగా జీంటారని డాక్టర్ రమ్య చెప్పారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ... ఎత్తుకు తగ్గ బరువు, పొట్ట తక్కువగా ఉండడం ఆరోగ్య లక్షణాలని తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తర్వాత ఉద్యోగులకు మధుమేహం, రక్తపోటు పరీక్షలను నిర్వహించి సలహాలు ఇచ్చారు. ఉద్యోగుల భవన నిర్మాణానికి విశ్రాంత ఉద్యోగి జయరామరాజు రూ.50వేలను అందించారు. ఈ కార్యక్రమంలో గుణశేఖర్‌రెడ్డి, కుప్పయ్య, యుగంధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల మళ్లింపు

వరదయ్యపాళెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదూరు క్రాస్ వద్ద పోలీసులు భారీ వాహనాలను మళ్లించారు. కదూరు పంచాయతీలో ఈనెల 11, 12 తేదీల్లో గంగజాతర జరగనుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తకుండా తడ మీదుగా వాహనాలను మళ్లించినట్టు ఎస్‌ఐ మల్లికార్జున చెప్పారు.

మొదలైన గంగ జాతర సందడి



మహిళల వేషంలో పాల బిందెలను మోసుకొస్తున్న పురుషులు



అమ్మవారి విగ్రహ నిమజ్జనం

సత్యవేడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సత్యవేడుకు గంగ జాతర శోభ సంతరించుకుంది. ఏటా జాతరను మే, జూన్ నెలల్లో నిర్వహిస్తారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర తరహాలో పెద్ద ఎత్తున నిర్వహించే సత్యవేడు గంగ జాతర పరిసర ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలను, జీవన శైలిని ప్రతిబింబిస్తుంది. జాతరకు జిల్లా నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు తరలివస్తారు. ఈనెల 11, 12 తేదీల్లో జాతర నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. పట్టణంలో ప్రధాన వీధులన్నీ విద్యుత్ దీపాల కటౌట్లతో కళకళలాడుతున్నాయి. శ్రీకాళహస్తి మార్గంలోని సాయిబాబా ఆలయం నుంచి ఊత్తుకోట్ట రోడ్డులోని మురుగన్ ఆలయం వరకు అమ్మవారి విద్యుత్ ఆర్చిలను ఏర్పాటు చేశారు. క్లాక్ టవర్ నుంచి గంగమిట్ట వరకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. సోమవారం ఘటం ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు ఆడవేషాలు ధరించి సందుల్లో తిరుగుతూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

జాతర కార్యక్రమాలు

ఈనెల 10న ఘటం ఊరేగింపు, 11న రాత్రి అమ్మవారి విగ్రహం ఊరేగింపు, 12న వేకువజామున గంగ మిట్టలోని అమ్మవారి ఆలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠ, ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి దర్శనం, రాత్రికి

ట్రాఫిక్ మళ్లింపు

జాతర సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా సీఐ మురళి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. పట్టణంలోకి భారీ వాహనాలు ప్రవేశించకుండా కదూరు క్రాస్, మాదరపాకం క్రాస్, దాసుకుప్పం క్రాస్‌లలో పోలీసు సిబ్బందిని నియమించి ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు చేపట్టారు. ప్రధానంగా జాతర జరిగే రెండు రోజులు పట్టణంలో వాహన రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేశారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని అరెస్టు చేయండి



ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

నారాయణవనం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని అరెస్టు చేయాలని సోమవారం తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి ఏకే లత ఆధ్వర్యంలో మహిళా సంఘాలు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సాక్షి మీడియా చానల్‌లో జరిగిన డిబేట్‌లో రాష్ట్ర రాజధాని అమరావతిని, దాని చుట్టుపక్కల ఉన్న మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజు, అందుకు సహకరించిన కొమ్మినేని శ్రీనివాసరావును వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. కనీస అవగాహన లేకుండా ఎవరో చెప్పించినట్లు మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ మేరకు ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు లత, కార్యదర్శి రాజేశ్వరి, నీలావతి, శాంతి, జానకి, లక్ష్మి, లోకమ్మ పాల్గొన్నారు.

ఇదేం చోద్యం... దర్జాగా రోడ్డు ధ్వంసం!



రోడ్డు పగులగొట్టి ప్యాచ్ వేసిన దృశ్యం

శ్రీకాళహస్తి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిని ఓ ప్రైవేటు వ్యక్తి దర్జాగా ధ్వంసం చేయడం విమర్శలకు దారి తీసింది. పట్టణంలోని వీఎంసీ కూడలి నుంచి అగ్నిమాపక కేంద్రం వరకు ఉన్న మార్గాన్ని పాత వరదయ్యపాళెం రోడ్డుగా పిలుస్తుంటారు. ఈ మార్గంలోనే ఆర్టీసీ బస్టాండు కూడా ఉంది. సుమారు పాతికేళ్ల క్రితం ఇక్కడ రోడ్డు దయనీయంగా ఉండేది. ఆర్టీసీ బస్టాండు నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగించే మార్గం కావడంతో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఇక్కడ శాశ్వత పరిష్కారం చూపారు. సుమారు రెండు అడుగుల ఎత్తుమేర అత్యంత దృఢంగా కాంక్రీట్ రోడ్డును నిర్మింపజేశారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అక్కడక్కడ పైపులు, కేబుళ్ల రోడ్డు అవతలి వైపుకు వెళ్లేందుకు వీలుగా నిర్మించారు. ఎవరూ రోడ్డుపై తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకున్నారు. అయితే వీఎంసీ థియేటర్ ఎదురుగా ఓ ప్రైవేటు వ్యక్తి దృఢమైన రోడ్డును తన సొంత అవసరాల కోసం ఆదివారం రాత్రి పగులగొట్టాడు. స్థానికులు అడ్డుకున్నారు. అయితే సదరు వ్యక్తి తనకు పురపాలకసంఘ అధికారుల అండ ఉందంటూ యుద్ధ ప్రతిపాదికన రోడ్డు పగులగొట్టి ప్యాచ్ వేశాడు. ఇక్కడికి సమీపంలోనే పైపులైను లాగేందుకు వెసలబాటు ఉన్నప్పటికీ ప్రవేటు వ్యక్తి బరితెగించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. పురపాలకసంఘ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంపై ఇదేం చోద్యమంటూ విస్మయం వ్యక్తం చేశారు.

షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం



మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న జాహ్నవి, తులసి

శ్రీకాళహస్తి, జూన్ 9(ఆంధ్రజ్యోతి) తొట్టంబేడు మండ లంలోని పిల్లమేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన ఎం.జాహ్నవి సోమవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి 540 మార్కులతో ఉత్తీర్ణత సాధించిన గిరిజన విద్యార్థి తులసి సోమవారం మహతి ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డును మంత్రి సత్యప్రసాద్ చేతుల మీదుగా అందుకుంది. ఆమెను కలెక్టర్ వెంకటేశ్వర్, విద్యాశాఖ అధికారులు అభినందించారు.

విద్యార్థులను ప్రోత్సహిస్తాం

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. సోమవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో షైనింగ్ స్టార్స్ అవార్డుల పంపిణీలో ఆయన మాట్లాడుతూ... సత్యవేడు నియోజకవర్గంలో ఏడు మండలాల్లో 42 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డు వరించడం గర్వంగా ఉందన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



తొట్టంబేడులో జరిగిన ఆవిర్భావ దినోత్సవం

శ్రీకాళహస్తి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొట్టంబేడు ఎమ్మార్సీ వద్ద జెండాను ఆవిష్కరించిన అనంతరం సీపీఐ ఏరియా కార్యదర్శి జె.గురవయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మరిన్ని పోరాటాలు చేయాలన్నారు. దేవేంద్ర, పెరిమిడి, సుధాకర్ యాదవ్, హరికృష్ణ, గజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణతో పాటు ఉపాధ్యాయ సమస్యల సాధనలో నిరంతరం కృషి చేస్తున్న యూనియన్ రాష్ట్రోపాధ్యాయ సంఘం అని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు యువశ్రీ మురళి అన్నారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర కాన్ఫరెన్సుకు ఎమ్మెల్యేల హాజరు

శ్రీకాళహస్తి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు అమరావతి నుంచి స్వర్ణాంధ్ర 2047పై వీడియో కాన్ఫరెన్సును సోమవారం నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన వీసీకి ఎమ్మెల్యే సుధీర్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం సీఎం చెప్పిన పలు అంశాలపె అధికారులతో చర్చించారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర వీడియో కాన్ఫరెన్స్‌కు ఎమ్మెల్యే ఆదిమూలం హాజరయ్యారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన వీసీకి ఎమ్మెల్యేతోపాటు తహసీలార్లు రాజశేఖర్, టీవీ సుబ్రమణ్యం, ఎంపీడీవోలు ప్రసాద్, శేఖర్, వెంకటమ్మ, బాలాజీ నాయక్, మాలతి, ఏవోలు త్రివిక్రమరావు, శివయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై మందులు పిచికారి చేసే డ్రోన్‌ను రైతు చంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే అందించారు. ఏవో మురళి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తోతాపురి మామిడి కాయలను రూ.12వేలుకు కొనుగోలు చేయాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపెళ్లూరులోని రాసా ఫుడ్స్ ఫ్యాక్టరీలో తోతాపురి రకం మామిడి కాయలను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.12.వేలకు కొనుగోలు చేయాలని ఏవో భారతి తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో సోమవారం ఆమె చర్చించారు. ఉద్యానవన అధికారి శారద, వీఆర్వోలు భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించండి

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం, రైతు సంఘం నాయకుడు దాసరి జనార్దన్ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కిలో రూ.12 చొప్పున కొనుగోలు చేస్తామని చెప్పి ప్రభుత్వం రూ.4, పరిశ్రమ నిర్వాహకులు రూ.8 చెల్లించే విధంగా రైతులతో ఒప్పందం చేసుకున్న తరువాత కంపెనీ నిర్వాహకులు రూ.8 కంటే తక్కువ చెల్లించడం దారుణమన్నారు.

ఆలయ పరిసరాల్లో తనిఖీ



శ్రీకాళహస్తి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాల్లో పోలీసులు ఆదివారం రాత్రి తనిఖీలు చేపట్టారు. బీట్ కానిస్టేబుళ్లు, బ్లూకోల్ట్స్, రక్షక్, హైవే మొబైల్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ఆలయం 1, 2, 3, 4వ గేటు పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ భక్తుల రక్షణ కోసం ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

విమానాశ్రయంలో ప్రముఖులకు స్వాగతం

రేణిగుంట, జూన్ 9, (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తల సమావేశానికి హాజరయ్యేందుకు సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంభూపాల్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, నరసింహులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె రోడ్డు మార్గాన చిత్తూరుకు బయలుదేరి వెళ్లారు. అలాగే తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొనడానికి విజయవాడ నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప సాద్‌కు టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఆముదాల తులసీరామ్, కార్పొరేటర్ నరసింహాచారి, పాటకం వెంకటేష్, ఆముదాల గిరిబాబు తదితరులు స్వాగతం పలికారు.

ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా

వరదయ్యపాళెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనపురంలో గ్యాస్ పైప్‌లైను నిర్మాణ క్రమంలో పంచాయతీ నీటి పైపులైను దెబ్బతింది. గత మంగళవారం నుంచి తాగునీటి సమస్య తలెత్తింది. సమస్య అధికారుల దృష్టికి వెళ్లగా స్పందించిన వారు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. వీలైనంత త్వరగా తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపుతా మని ఈవో బసిరెడ్డి తెలిపారు.